**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ప్రసారార్థం :

విజయవాడ,
**తేది : 01 జూలై, 2023.**

## పోలవరం నిర్వాసితుల సమస్యలపై నీటిపారుదల శాఖ మంత్రికి సిపిఐ(ఎం) ప్రతినిధి బృందం విజ్ఞాపన
## - జూలై 5వ తేదీన సిపిఐ(ఎం) బృందంతో చర్చలు

ఈ రోజు (01.07.2023) సిపిఐ(ఎం) ప్రతినిధి బృందం రాష్ట్ర నీటి పారుదల శాఖామాత్యులు అంబటి రాంబాబు గారిని గుంటూరులో కలిసి పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలపై విజ్ఞాపన పత్రం అందించి చర్చించింది. మంత్రిగారు ఈ అంశాలపై ప్రతినిధి బృందంతో చర్చించేందుకు సంబంధిత అధికారులతో జూలై 5వ తేదీన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.

మంత్రిగారిని కలిసిన బృందంలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఏ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిపిఐ(ఎం) రంపచోడవరం కార్యదర్శి బొప్పెన కిరణ్, ఏలూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మొడియం నాగమణి, గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావులు ఉన్నారు.

J. Jayaram

**(జె.జయరాం)**
ఆఫీసు కార్యదర్శి

**నోట్ : మెమోరాండం కాపీని జత చేసి పంపుతున్నాము.**

**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: apcpim@gmail.com

**గుంటూరు,**

**01 జూలై, 2023.**

**శ్రీయుత అంబటి రాంబాబు గారికి,**
గౌరవ నీటిపారుదల శాఖామాత్యులు,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
అమరావతి.

**విషయం : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విజ్ఞప్తి.**

**అయ్యా!**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై మహాపాదయాత్ర జూన్ 20న అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక గ్రామం నుండి ప్రారంభమైంది. వందలాది మందితో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నాలుగు విలీన మండలాలు, ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు, కుకునూరు మండలాలు గుండా సాగి విజయవాడలో జూలై 4న మహాధర్నాతో ముగుస్తుంది. ఈ సందర్భంగా పాదయాత్ర బృందం దృష్టికి వచ్చిన నిర్వాసితుల సమస్యలను, దీర్ఘకాలంగా ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మీ దృష్టికి తీసుకువస్తున్నాము. వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించుటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చొరవ చూపించడం లేదు. నిర్వాసితుల సమస్యలు తీవ్రంగాను, దయనీయంగాను ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ పోలవరం ప్రాజెక్టును రెండు దశలుగా విభజించి మొదటి దశ 41.5 కి.మీటర్ల దగ్గర 20 గ్రామాలు మాత్రమే మునిగిపోతాయని నిర్ధారించారు. 20 వేల మందిని నిర్వాసితులుగా తేల్చారు. నిజానికిది వాస్తవం కాదు. గత వరదల్లో 40 మీటర్లకు కూడా చేరకముందే 193 గ్రామాలు మునిగిపోయాయి. ప్రజలు పెద్దయెత్తున ఆందోళన చేస్తే మరో 36 గ్రామాలను చేర్చారు. దీనికి మరో 5200కోట్లు ఖర్చు అవుతుందని తేల్చారు. కానీ 45.5 మీటర్ల వద్ద మునిగే గ్రామాలు కూడా మొన్నటి వరదల్లో మునిగిపోయాయి. దశలు, కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా గ్రామాలకు వరద పోటెత్తింది. ఈ వాస్తవాలన్నీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గమనంలోకి తీసుకోలేదు. నిర్వాసిత గ్రామాల పేరుతో నిర్మించిన ఇళ్ళు కూలి మొన్న వరదలకు మునిగిపోయాయి. అందువల్ల తప్పు లెక్కలు ప్రక్కన పెట్టి 1986, 2022 వరదల ఆధారంగా పునరావాసానికి చర్యలు తీసుకోవాలి.

గత సంవత్సరం వచ్చిన వరదలలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నాలుగు మండలాలు, ఏలూరు జిల్లాలోని రెండు మండలాలు వంద రోజులపాటు వరదలో ఉన్నాయి. వేలాది కుటుంబాలు నిరాశ్రయులై నానా అగచాట్లు పడ్డాయి. ప్రభుత్వం కుటుంబానికి రు.2000 చొప్పున సహాయం తప్ప నిత్యావసర వస్తువులు, నష్టపరిహారం అందించలేదు. అవసరమైన సహాయ చర్యలు చేయలేదు. ఈ సంవత్సరం జూలై, ఆగస్టు నెలల్లో మరలా వరద వచ్చే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

ప్రాజెక్టు నిర్మాణ ప్రదేశం, దాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతాల నుండి ప్రజలను బలవంతంగా నిర్వాసిత కాలనీలకు గతంలో తరలించారు. అయితే ఆ కాలనీల్లో మంచినీరు, వీధి దీపాలు వంటి కనీస సౌకర్యాలు లేకపోవడం దారుణం. స్మశానవాటికలు కూడా లేవు. పాఠశాలలు లేవు. వైద్యం కోసం వారు సుదూర ప్రాంతాలకు వెళ్ళవలసి

**....2వ పేజి**

వస్తోంది. భూమికి భూమి వారికి ఇవ్వలేదు. కొన్ని గ్రామాల్లో చూపించినప్పటికీ ఆయా భూములు కోర్టు వివాదాల్లో ఉండడం మూలంగా గిరిజనులకు సాగు సాధ్యం కావడం లేదు. అనేకమందికి యూత్ ప్యాకేజి ఇప్పటికీ అమలు చేయలేదు. పోడు భూమి పట్టాలు కూడా ఇవ్వలేదు. అన్నిటికంటే మించి రోజువారీ బ్రతుకుదెరువుకు అవసరమైన మహాత్మాగాంధీ ఉపాధిహామీ పనులు సైతం వారికి కల్పించడం లేదు. వారి ఇళ్ళకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించవలసి ఉన్నప్పటికీ కరెంటు బిల్లులు వసూలు చేస్తున్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 ఆర్&ఆర్ చట్టం సమగ్రంగా అమలు జరిపి పరిహారం, పునరావాసం కల్పించాలని, వరద ప్రాంత మండలాలలో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని, గతంలో వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని, కాంటూరు లెక్కలను శాస్త్రీయంగా రూపొంద్ధించాలని కోరుతున్నాం.

కోర్కెలు :

1) నిర్వాసితులకు పునరావాసం, పరిహారం పూర్తిగా అమలు చేసే వరకు గ్రామాలు ఖాళీ చేయించరాదు.
2) పునరావాసం పూర్తయ్యే వరకూ ముంపు గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు యధావిధిగా కొనసాగించాలి.
3) 1986, 2022 నాటి వరద ముంపు ఆధారంగా ముంపు గ్రామాల రీసర్వే చేయాలి.
4) పునరావాసం దశల వారీగా కాకుండా ఏకకాలంలో అన్ని గ్రామాల్లో పూర్తి చేయాలి.
5) మండలాన్ని యూనిట్‌గా తీసుకొని ఆర్&ఆర్ పరిహారం అర్హులందరికీ ఇవ్వాలి.
6) ముంపు మండలాల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రతి ఎకరాకు 20 లక్షలు చెల్లించాలి.
7) ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నిర్వాసిత కుటుంబానికి కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా 10.50 లక్షల పరిహారం ఇవ్వాలి. జివో నెం. 224 అమలుపర్చాలి.
8) గ్రామాలు ఖాళీ చేయించే నాటికి 18 సంవత్సరాలు పూర్తయిన యువతీ, యువకులు అందరికీ ఆర్&ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. పెండ్లి అయిన ఆడపిల్లలకు కూడా ప్యాకేజీ ఇవ్వాలి.
9) సర్వం కోల్పోతున్న ప్రతి నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.
10) ముంపు ప్రాంతాల ఉద్యోగులందరిని యధాతధంగా తరలించే ప్రాంతాల్లో కొనసాగించాలి.
11) నిర్వాసితుల కాలనీల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి.
12) ముంపు మండలాల్లో మునిగిపోతున్న పాఠశాలలు, కళాశాలలను పునరావాస కాలనీల్లో నిర్మించేందుకు సమగ్ర ప్రణాళిక తయారుచేయాలి.
13) పునరావాస కాలనీలో అన్ని రకాల ప్రాథమిక సౌకర్యాలను ఏర్పాటు చేయాలి. వారు స్థిరపడేంతవరకు కాలనీలన్నిటికీ ఒక ఐఏఎస్ అధికారుని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఆరు నెలల్లోగా అన్ని సమస్యలను పరిష్కరించాలి.
14) నిర్వాసితులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రతీ డివిజన్ కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలి.

అభివందనములతో...

(కె.ఎస్. లక్ష్మణరావు)
శాసనమండలి సభ్యులు

(ఎం.ఎ. గఫూర్)
సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

(వై. వెంకటేశ్వరరావు)
సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

(బొప్పెన కిరణ్)
సిపిఐ(ఎం) రంపచోడవరం
జిల్లా కార్యదర్శి

(మొడియం నాగమణి)
సిపిఐ(ఎం) ఏలూరు జిల్లా
కార్యదర్శివర్గ సభ్యులు

(పాశం రామారావు)
సిపిఐ(ఎం) గుంటూరు
జిల్లా కార్యదర్శి